క్లుప్తంగా

జీఎంను సత్కరించిన ఉద్యోగులు



కృష్ణయ్యను సత్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా గిరిజన సంక్షేమ సంఘం ఉద్యోగులు గురువారం జీఎం కార్యాలయంలో జీఎం వీసం కృష్ణయ్యను ఘనంగా సత్కరించారు. ఆంగోత్ భాస్కర్‌రావు, భూక్యా నాగేశ్వరరావు, వెంకట్రావు, ఉండం బ్రహ్మం, జే.వెంకటేశ్వర్లు, ఉపేంద్ర, వాంకుడోతు కిషన్, ఈర్యా, బానోతు రవి నాయక్, సురేష్, రామస్వామి, బాలకిషన్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీగా బాధ్యతలు చేపట్టిన సీహెచ్‌పీ ఉద్యోగి మహబూబ్‌ను అక్కడి ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.

11న గీతా జయంతి

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 11న గీతా జయంతి సందర్భంగా కొత్తగూడెం మండలంలో, విద్యానగర్ కాలనీ మాస్టర్ ఈకే విద్యాలయంలో భగవద్గీత శ్లోకాల పోటీల ఫ్లెక్సీని సీఐలు కరుణాకర్, వెంకటేశ్వరరావు గురువారం ఆవిష్కరించారు. మాట్లాడుతూ... 6 తరగతి నుంచి 9 వరకు విద్యార్థులకు 6వ అధ్యాయంలో పోటీలు ఉంటాయని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వై.పూర్ణచంద్రరావు, రమాదేవి, వెంకటేశ్వరరావు, నంది శశికుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన వైద్యాధికారి



దేవంద్రరాజ్‌పుత్

పాల్వంచరూరల్: పదేళ్లగా ఖాళీగా ఉన్న ఉల్వనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రెండో మెడికల్ ఆఫీసర్ పోస్టును ఎట్టకేలకు భర్తీ చేశారు. ఉల్వనూరు పీహెచ్‌సీ రెండో వైద్యాధికారి లేక గిరిజన ప్రాంత ప్రజలు పాల్వంచ, కొత్తగూడెం పట్టణాలకు వైద్యం కోసం వెళ్లాల్సిన పరిస్థితి. నూతనంగా నియమితులైన అసిస్టెంట్ సివిల్ సర్జన్‌గా డాక్టర్ దేవంద్ర రాజ్‌పుత్ బుధవారం బాధ్యతలు చేపట్టారు.

సమ్మె నోటీసు అందజేత

టేకులపల్లి: మండలంలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు కేజీబీవీ ఉపాధ్యాయులు, వర్కర్స్ ఎంఎంఎస్, సీసీఓ, సీఆర్‌పీ, ఐఈఆర్‌పీ, మెసెంటర్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జేఏసీ మండల అధ్యక్షుడు బాదావత్ భాస్కర్, ప్రధాన కార్యదర్శి డి.పార్వతి డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర, జిల్లా జేఏసీ కమిటీలు ఇచ్చిన పిలుపు మేరకు గురువారం టేకులపల్లి ఎంఈఓ జగన్ నాయక్‌కు సమ్మె నోటీసు ఇచ్చారు. మాట్లాడుతూ... 6,7న రాష్ట్ర వ్యాపితంగా కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలు చేపడుతున్నామని, 9 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు చెప్పారు.

ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు

ఇల్లెందు: ప్రజా పాలన వారోత్సవాలలో భాగంగా గురువారం ఇల్లెందులో చెరువు కట్టపై చెత్తను తొలగించి శుభ్రం చేశారు. అధికారులు మాట్లాడుతూ... పట్టణ ప్రజలు చెరువును పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తాచెదారం చెరువులో వేయవద్దన్నారు. త్వరలో మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీకాంత్, మేనేజర్ అంకుషావలీ, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌పీడీసీఎల్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఎన్నిక



ప్రతాప్‌కుమార్



ఉదయ్ రత్నకుమార్

పాల్వంచ: ఎన్‌పీడీసీఎల్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ప్రతాప్ కుమార్, ఉదయ్ రత్నకుమార్‌లను ఎన్నుకున్నారు. గురువారం స్థానిక వాసవీ బ్లాంకెట్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కుమార్‌రావు, అశోక్‌కుమార్, మహిళా ప్రతినిధిగా జ్యోతి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించండి..

ఇల్లెందురూరల్: యూత్ కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడిగా ఎన్నికైన పూనెం మధును కాంగ్రెస్ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకడు చీమల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యూత్ కాంగ్రెస్ కీలక భూమిక పోషించాలని సూచించారు. పార్టీ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని, నిర్మాణాత్మక అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పోషం వెంకటేశ్వర్లు, చీమల బక్కయ్య, అలెం హరీష్ పాల్గొన్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా..

- కిన్నెరసాని, ముర్రేడు వాగుల నుంచి ట్రాక్టర్ల ద్వారా తరలింపు
- అడ్డుకున్నవారిపై దాడి చేస్తున్న వ్యాపారులు
- రాత్రివేళల్లో గుట్టుగా మట్టి, ఇసుక దందా
- ప్రభుత్వ ఆదాయానికి గండి..



దొడ్డిదారిన ఇసుక రవాణా చేసేందుకు చెక్‌డ్యామ్‌కు గండిపెట్టిన దృశ్యం

పాల్వంచరూరల్: ఇసుక అక్రమ రవాణా కారణంగా ప్రభుత్వ ఆదాయానికి రూ.లక్షల్లో గండిపడుతోంది. కిన్నెరసాని వాగులో అధికారికంగా ఇసుక ర్యాంప్‌లను ఏర్పాటు చేస్తే ఇటు ప్రభుత్వానికి ఆదాయం, అటు కూలీలకు, ట్రాక్టర్ల యజమానులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అయినా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో అక్రమ వ్యాపారులు రెచ్చిపోతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడం వలన పగలు, రాత్రి ఇసుక దందా జోరుగా సాగుతోంది. నాగారం, రంగాపురం వద్ద గల కిన్నెరసాని వాగు నుంచి, తోగ్గూడెం, దంతలబోరు వద్ద గల ముర్రేడు వాగుల్లో కూలీలు, యంత్రాల ద్వారా తవ్వుతూ ట్రాక్టర్ల ద్వారా పాల్వంచ, కొత్తగూడెం, ఖమ్మం ప్రాంతాలకు అక్రమంగా తరలించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. దీనిని అరికట్టాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

పెరిగిన ఇళ్ల నిర్మాణాలు...

ఇళ్ల, రహదారుల నిర్మాణాలు పెరడంతో ఇసుకకు మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. ఇదే అదునుగా అక్రమదారులు అడ్డదారుల్లో వ్యాపారం చేస్తున్నారు. దీంతో వాగులు పాతళగంగను తలపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యాన్ని అసరాగా చేసుకుని రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. ఆయా వాగులను నమ్ముకుని వ్యవసాయం చేస్తున్న రైతులకు సాగునీరు అందకుండా పోతోంది. ప్రభుత్వాదాయానికి గండి పడుతోంది. ఈ వ్యవహారంలో సంబంధిత శాఖల అధికారులు చూసిచూనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఇతర ప్రాంతాలకు తరలింపు...

మండలంలోని తోగ్గూడెం, రంగాపురం, నాగారం, దంతలబోరు ప్రాంతాల్లోని వాగులలో ఇసుక నిల్వలు అపారంగా ఉన్నాయి. ఇరిగేషన్‌శాఖ నిర్మాణం చేసిన చెక్ డ్యామ్ కట్టకు గండిపెట్టి అందులో నుంచి ఇసుక రవాణా చేస్తున్నారు. అనుమతులు లేకుండానే రాత్రి సమయంలో జేసీబీ సహాయంతో లారీల ద్వారా అక్రమంగా రవాణా చేస్తున్నారు. చికటి పడితే చాలు కిన్నెరసాని, తోగ్గూడెం ప్రధాన రోడ్లపై ఇసుక ట్రాక్టర్లు జోరుగా తిరుగుతున్నాయి. వ్యాపారులు, లారీల యజమానులు, కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారి అక్రమ వ్యాపారం చేస్తున్నారు. వాగుల నుంచి ఇసుకను నిర్దేశించిన రహస్య ప్రదేశంలో నిల్వ చేస్తారు. అక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.



రాత్రి సమయంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

అధికారులపై దాడి...

కిన్నెరసాని వాగు నుంచి ఇటీవల ఇసుకను అక్రమంగా తరలిస్తున్న సమాచారం అందుకున్న నాగారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ హరినాయక్ ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని తీసుకొస్తుండగా వ్యాపారులు ఆయన ట్రాక్టర్‌పై ఉండగానే దౌర్జన్యం చేసి కేశవాపురం వద్ద ఇసుకను అన్‌లోడు చేసి వెళ్లిపోయారు. ఈ సంఘటనలో రూరల్ పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. గతంలో కూడా ఇలా దాడి జరిగిన సంఘటనలు ఉన్నాయి.

అక్రమ రవాణాను అరికట్టాలి..



కిన్నెరసాని వాగులో నుంచి ఇసుక అక్రమ రవాణా నిత్యకృత్యంగా మారింది. అధికారులు దీనిని అరికట్టాలి. ఇసుక అక్రమ వ్యాపారులు తమను అడ్డుకోకుండా ఉండేందుకు ట్రాక్టర్‌కు కొంత వసూళ్లు చేసి అధికారులకు మామూళ్లు ముట్టజెప్పి దందా చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– బుడగం నాగేశ్వరరావు, యానంబైల్

అనుమతులు ఇవ్వాలి..



కిన్నెరసాని వాగులో ఇసుక ర్యాంప్‌లకు అధికారులు అనుమతులు ఇవ్వకపోవడం వలన ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. స్థానికులు ఉపాధి కోల్పోతున్నారు. ఇష్టం వచ్చినట్లుగా ఇసుకను తవ్వడం వలన భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి.

– నిమ్మల రాంబాబు, బంద్రుగొండ

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం..



అనుమతులు లేకుండా ఇసుక, మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటాం. రంగాపురం, తోగ్గూడెం గ్రామాల నుంచి అక్రమంగా రాత్రి సమయంలో ఇసుకను తరలిస్తున్నట్లు తన దృష్టికి వచ్చింది. నిఘా పెట్టి పెట్రోలింగ్ చేస్తున్నాం. మైనింగ్, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులతో కలిపి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం.

– వివేక్, తహసీల్దార్, పాల్వంచ

దేశానికి కమ్యూనిస్టులు అవసరం



మాట్లాడుతున్న కనకయ్య

ఇల్లెందు: కమ్యూనిస్టులకు ఈ దేశం అవసరం ఉన్నా లేకున్నా ఈ దేశానికి మాత్రం కమ్యూనిస్టుల అవసరం ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. గురువారం ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉందన్నారు. బీజేపీ విధానాలు అన్నివర్గాలను తీవ్ర ఇబ్బందులు పెడుతోందన్నారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కి నాలుగు లేబర్ కోడ్‌లను, రైతాంగానికి గుదిబండగా మారిన రైతు చట్టాలు తెచ్చిందన్నారు. ఇక విద్యలోనూ కాషాయికరణ సాగుతోందని, బీజేపీని వ్యతిరేకించేందుకు లౌకిక శక్తులు ఏకం కావాలన్నారు. సింగరేణి పుట్టినిల్లైన ఇల్లెందులో జిల్లా మహాసభలు నిర్వహించుకోబోతున్నామని తెలిపారు. ఈ మహాసభలను విజయవంతం చేసేందుకు గ్రామగ్రామాన సభలు సమావేశాలు నిర్వహించాలన్నారు. రైతులు, కూలీలు, వ్యాపార వాణిజ్య ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నేతలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏజే రమేష్, కొండపల్లి శ్రీధర్, అబ్దుల్ నబీ, కిరణ్, కృష్ణ, ఖాదర్, మాదారపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

టేకులపల్లి: మండలంలోని పలు పంచాయతీల్లో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య శుక్రవారం పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కోరం సురేందర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధి ఎఫ్‌ఏల కార్యవర్గం ఎన్నిక



రమేష్

జూలూరుపాడు: ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ మండల అధ్యక్షుడిగా మాచినేనిపేట తండాకు చెందిన మూడ్ రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రమేష్, ఉపాధ్యక్షుడిగా ధరంసోత్ రవి, కార్యదర్శిగా బానోత్ భద్రం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గుగులోత్ నగేష్, బానోత్ వాల్యా, గుగులోత్ హరికిషన్, డి.నాగమణి, ఎ.లక్ష్మి, బి.జగదీష్, ఎస్కే షరీఫ్, బి.నరేష్ పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న చావా రవి

కొత్తగూడెంఅర్బన్: జీఓ 317లోని నిబంధనలకు అనుగుణంగా ఉన్న భార్యాభర్తలు, ప్రాధాన్య కేటగిరీలు, పరస్పర బదిలీలు మాత్రమే చేయాలని నిర్ణయిస్తూ రాష్ట్ర ప్రభుత్వ జీఓ జారీ చేయడం పట్ల టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం కొత్తగూడెంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బి.కిషోర్‌సింగ్ అధ్యక్షతన జరిగిన జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో రవి మాట్లాడారు. జీఓలోని అసంబద్ధమైన నిబంధనల కారణంగా పలువురికి నష్టం జరిగిందని, వాటిని సవరించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ఈపీ – 2020 రద్దు చేయాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎంటీఎస్ మంజూరు చేయాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బి.రాజు, ఎస్.కృష్ణ, వి.వరలక్ష్మి, బి.మురళీమోహన్, ఎం.వెంకటేశ్వర్లు, ఎం.పద్మరాణి, డి.దాసు, టి.శ్రీనివాసరావు, డి.తావుర్య, పాల్గొన్నారు.

8న యూటీఎఫ్ మహాసభ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: ఈనెల 8న కొత్తగూడెంలో జరగనున్న యూటీఎఫ్ 5వ మహాసభను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.రాజు అన్నారు. ఈ మేరకు గురువారం పాత పాల్వంచలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. రాజు మాట్లాడుతూ... సభలకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ కాపు సీతాలక్ష్మి, పలు శాఖల అధికారులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కృష్ణ, కార్యదర్శులు టి.శ్రీనివాస్, రాజయ్య, ఎస్‌కే.యాకూబ్ పాషా, ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వితరణ

పాల్వంచ: లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ గోల్డ్ ఆధ్వర్యంలో గురువారం ఆశ్రమ పాఠశాలకు నాలుగు సీలింగ్ ఫ్యాన్‌లను వితరణ చేశారు. క్లబ్ అధ్యక్షుడు పోట్రు సతీష్ కుమారుడు పూజిత్‌సాయి పుట్టినరోజు సందర్భంగా ఫ్యాన్లను హెచ్‌ఎం భద్రునాయక్‌కు అందించారు.

అరెస్టులను నిరసిస్తూ ఆందోళన

ఇల్లెందు: ప్రజాపాలనను ప్రశ్నించినందుకు అక్రమంగా అరెస్టులకు పాల్పడుతున్న కాంగ్రెస్‌కు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. గురువారం ఇల్లెందులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సిలివేరు సత్యనారాయణ మాట్లాడుతూ.. మాజీ మంత్రి హరీష్‌రావు, పాడి కౌశిక్‌రెడ్డిలను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజాప్రతినిధులకు కూడా రక్షణ లేకుండా పోయిందన్నారు. బేషరతుగా అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని కోరారు. అజ్మీరా భావ్‌సింగ్ నాయక్, ఆదూరి రవి, అబ్దుల్ నబీ, రాచపల్లి శ్రీను, కడకంచి వీరస్వామి, జబ్బార్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: ప్రతిపక్ష నాయకులపై కక్షపూరిత చర్యలు మానుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు అన్నారు. జూలూరుపాడులో గురువారం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధిని గాలికొదిలేసి ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు పెట్టడం సరైన విధానం కాదన్నారు. అరెస్టులు, నిర్బంధాలు, అక్రమ కేసులు ఇవేవీ బీఆర్ఎస్ నాయకులకు కొత్త కాదన్నారు.

మట్టి పరీక్షలతో అధిక దిగుబడులు



జూలూరుపాడు: పాపకొల్లులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ దీపక్ ఆనంద్

ఇల్లెందురూరల్: సాగు ప్రారంభానికి ముందే మట్టి పరీక్షలు చేయించుకుంటే నాణ్యమైన అధిక దిగుబడులకు బాటలు వేసుకునే అవకావం ఉంటుందని మండల వ్యవసాయశాఖ అధికారి సతీష్ అన్నారు. ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా గురువారం సుదిమళ్ల రైతు వేదికలో మట్టి పరీక్షలపై అవగాహన కల్పించారు. రైతులు సాగు ప్రారంభానికి ముందే నేల సారాన్ని పరీక్షించుకోవాలని సూచించారు. తద్వారా నేలలో లోపించిన పోషకాలను అందిస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. మట్టి పరీక్షను రైతులే స్వయంగా చేపట్టవచ్చన్నారు.

జూలూరుపాడు: ప్రపంచ మృత్తికా (నేల) దినోత్సవాన్ని గురువారం పాపకొల్లు క్లస్టర్ ఏఈఓ విజయభాను ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ అధికారి దీపక్ ఆనంద్ మాట్లాడుతూ... నేలల స్వభావం, ఆరోగ్యంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంభించడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. మాచినేనిపేట క్లస్టర్ ఏఈఓ బి.గోపీకృష్ణ, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ నవీన్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

పోడు సమస్యను పరిష్కరిస్తా..



జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచరూరల్: పోడు రైతుల సమస్యలపై శీతాకాలం అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని తవిశలగూడెం, పాయకారియానంబైల్ గ్రామపంచాయతీలలో రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన పంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. మాట్లాడుతూ... పోడు రైతులకు న్యాయం జరిగేవిధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా శ్రమిస్తానన్నారు. ఈజీఎస్, డీఎంఎఫ్టీ, ఎస్టీఎఫ్ తదితర నిధులతో పదకొండు నెలల్లో రూ.కోట్లు ఖర్చు చేసి రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, డీఈ మధుకర్, పంచాయతీరాజ్ డీఈ రామకృష్ణ, ఎంపీడీఓ నారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్‌పాషా, మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, నాయకులు ఎడవల్లి కృష్ణ, చంద్రగిరి శ్రీను, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబా, కె.వెంకన్న, జి.నాగరాజు, వి.శ్రీను, వెన్నెం వెంకన్న, కొంగర అప్పారావు, మద్దుల వీరమోహన్, సుధాకర్, సతీష్, రమేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రజాపాలనలో ఆర్టీసీ సేవలు భేష్..

చుంచుపల్లి: ప్రజాపాలన నిర్వహణలో ఆర్టీసీ సేవలు భేష్ అని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత చేపట్టిన తొలిపథకం ఇదే కావడం, ఆ పథకానికి అపూర్వ స్పందన రావడానికి సిబ్బంది కృషి ఉందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా గురువారం కొత్తగూడెం ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. హాజరైన కూనంనేని మాట్లాడుతూ... మహిళలకు ఉచిత బస్ సదుపాయం కల్పించడంతో ఆర్టీసీకి ఆదరణ పెరిగిందన్నారు. ఆర్టీసీ కార్మికుల శ్రేయస్సు కోసం తనవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఓ ఎస్.రవి, కొత్తగూడెం ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎం భవాని ప్రసాద్, డీఎం దేవేందర్ గౌడ్, భద్రాచలం డీఎం తిరుపతి, నాయకులు సాబీర్‌పాషా, చంద్రగిరి శ్రీనివాస్, జోసఫ్, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి..



మాట్లాడుతున్న వెంకన్న

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీలలో కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జటంగి వెంకన్న, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి సారంగపాణి డిమాండ్ చేశారు. ఇల్లెందులోని ఇఫ్టూ కార్యాలయంలో గురువారం పంచాయతీ వర్కర్ల మండల స్థాయి సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. గడిచిన మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకపోయారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లిస్తోందని చెప్తూ ఆన్‌లైన్ ప్రక్రియలో నిబంధనల పేరుతో కార్మికులను కుదించే ప్రయత్నం జరుగుతోందని, దీనిని ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. పంచాయతీలలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లను తొలగించడం అన్యాయమని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కార్మికుల విధులను పర్మనెంట్ చేయడంతోపాటు రూ.26వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తోడేటి నాగేశ్వరరావు, డి.ప్రసాద్, మోహన్‌రావు, కిషోర్, విజయ్‌కుమార్, తిరుపతి, భీముడు, అరుణ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో దోపిడీని అరికట్టాలి



మాట్లాడుతున్న భిక్షం

జూలూరుపాడు: పత్తి, ధాన్యం మార్కెట్‌లలో దళారీల దోపిడీని అరికట్టాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ కార్యదర్శి ముద్దా భిక్షం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జూలూరుపాడులో మాట్లాడుతూ.. పత్తి పంట అధికంగా పండించే మండలాల్లో మార్కెటింగ్‌శాఖ అధికారులు సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో జూలూరుపాడు మండలంలోని రైతులు పత్తి పంట సాగు చేస్తున్నారని, ప్రస్తుతం ఇక్కడ కొనసాగుతున్న తాత్కలిక మార్కెట్ యార్డును శాశ్వత వ్యవసాయ మార్కెట్‌గా ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలతో ప్రజలు, రైతులు, కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. రైతులు పండిస్తున్న పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్స్ మేరకు మద్దతు ధరను వ్యవసాయ ఖర్చుకు 50 శాతం అదనంగా జోడించి అమలు చేయాలని, రుణమాఫీ చట్టం చేయాలన్నారు. కార్యక్రమంలో బానోత్ ధర్మా, వై.గోపాల్‌రావు, రాయల సిద్ధు తదితరులు పాల్గొన్నారు.


తహసీల్ ఎదుట నిరాహార దీక్ష



దీక్ష చేస్తున్న నాయకులు

జూలూరుపాడు: మండలంలోని చెరువులు, కుంటలు కబ్జా నుంచి కాపాడాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు, గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్, మాలమహానాడు మండల అధ్యక్షుడు బి.వీరస్వామి మాట్లాడుతూ... చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురికావడంతో నీటి సామర్థ్యం తగ్గి ఆయకట్టు భూములకు నీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. చెరువులు, కుంటలను ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే చేసి, సరిహద్దులు నిర్ణయించాలని పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో నిరాహార దీక్ష చేపట్టాల్సి వచ్చిందన్నారు. అధికారులు స్పందించి చెరువులు, కుంటలను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జెర్రిపోతుల నరేష్‌కుమార్, చరణ్, బాలు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఆనంద్

పాల్వంచ: ఎన్‌పీడీసీఎల్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్, కుమారస్వామి అన్నారు. గురువారం స్థానిక కేఎస్‌పీ రోడ్‌లోని వాసవీ బ్లాంకెట్ హాల్‌లో సర్కిల్ పరిధి ఉద్యోగుల సమావేశాన్ని సర్కిల్ కార్యదర్శి ఉదయ్ రత్నకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. మాట్లాడుతూ.. రిజర్వేషన్ ప్రాతిపదికన పదోన్నతులు కల్పించాలన్నారు. ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, ప్రమోషన్ల విషయంపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ నాయకులు నరసింహులు, అధ్యక్షులు ప్రతాప్, పురుషోత్తం, శ్రీధర్, ధర్మరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు న్యాయం చేయండి..



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: ఆటో కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆటో వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా సహాయ కార్యదర్శి గార్లపాటి శివకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జూలూరుపాడులో ఆటో కార్మికులతో కలిసి ఆయన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ఈనెల 7న ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఆటోల బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో ఆటో కార్మికులు జీవనోపాధి కోల్పోయారని, ఆటో, క్యాబ్ కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. గార్లపాటి వీరభద్రం, మహేష్, ఎస్కే బుడేన్‌పాషా, నరసింహారావు, శివ, దాసు పాల్గొన్నారు.